"వద్దు మేడం. ఇంట్లో నాయినతోని యిప్పటికే పెద్ద కొట్లాటయింది. రిజట్లు రాకముందే సెలవుల్లో నాన్న నాకో సంబంధం తెచ్చిండు. నేను ఏడ్చిన. నేను పిలగాన్ని మెచ్చకపోతే వాల్లు ఎల్లిపోయిన్రు."

"ఎట్లరా అరుణా! నా బాధ మీకు అర్థమైతలేదు. మీ కులంలో వందమందిలో నువ్వొక్కదానివి టెన్త్ దాక వచ్చినవు. హాస్టల్ల పదిమంది రాస్తే నలుగురే పాసైరి. సెకండు క్లాసు వచ్చిన నువ్వుకూడా చదువు మానేస్తే ఈ రిజర్వేషన్లు ఎందుకు... ఎవరికి? రిజర్వేషన్ సౌకర్యాలున్నా ఉపయోగించుకోకపోతే ఎట్లా...? నువ్వు ఒక్క యింటర్ దాటురా! నీకు ఉజ్వల భవిష్యత్తుంది... ఇంటర్ దాటితే ఎమ్మేదాకా చదువుకుంటుపోవచ్చు. ఏవో స్కాలర్‌షిప్పులు రానేవస్తయి. కనీసం టీచరైన కాకపోతే ఎట్ల?"

"నాకు ఈ పెద్దకులపోల్లతోని కల్సి చదువుడంటెనే భయం మేడం. ఏదేదో అని కించపరుస్తరు. ఈ పెద్దకులపు టీచర్లతోని- పెద్దకులపు పిలగాన్లకు చదువు చెప్పుడంటే గూడ నాకు భయమే మేడం..."

"అట్లా అని చదువు మానేస్తవ? ఈ భయాలన్ని ఓ ఏడాది పాతవడేదాక ఉంటయి. ఆ తర్వాత హాస్టల్లో లీడరైనట్టే నువ్వే మిగతా టీచర్లకు లీడర్ వైతవు. డిస్ట్రిక్ట్ టోర్నమెంట్స్‌లో రన్నర్ టీమ్‌గా వచ్చినా పీటీలందరు బెస్ట్ క్యాప్టెన్ అని నిన్ను మెచ్చుకోలేదా? అరుణా! ఒక్కటి గుర్తుంచుకో. భయపడితే భయపెడ్తరు. లోకాన్ని చూసి భయపడవద్దు. లోకం కూడా హాస్టల్ వంటిదే. ఆరేండ్ల నీ హాస్టల్ అనుభవాలు లోకాన్ని అర్థం చేసుకోవడానికి ఎంతో ఉపయోగపడ్తయి. ఇక్కడే కాదు, ఎక్కడైనా మంచీచెడ్డ అన్నీ కలగల్సే ఉంటయిరా!" ధైర్యం చెప్పి బలవంతంగా డబ్బుల్ని అరుణ చేతిలో కుక్కింది లలిత.

అరుణ వెళ్ళిపోయాక అటుకేసే చూస్తూ ఆలోచనల్లో పడిపోయింది లలిత. ఎందుకో అరుణలో తన చిన్ననాటి బాల్యం కన్పిస్తోంది. తనకపుడు కనీసం యిలా మాట మద్దతు యిచ్చేవారైనా లేరు. ఏ స్కాలర్‌షిప్పులు ఎలా వస్తాయో, ఏ చదువు చదివితే ఏ ఉద్యోగాలు వస్తాయో చెప్పేవారు లేరు. ఒక్కరైనా చెప్పేవారుంటే తాను యింకా చదివి ఈపాటికి యూనివర్సిటీ లెక్చరర్ అయి వుండేది. అందీఅందని ఆసరాతో రేపు అరుణ బతుకు కూడా తలాగే గెలిచి ఓడిన నిస్సారమైన బతుకవుతుందా? తన స్నేహితులు 'నీ బతుక్కేమైందే... హాయిగా నెలనెలా జీతం తీసుకొంటున్నవు... మేం సినిమాకు పోవాలన్నా భర్తలను అడుక్కోవాల్సిన దుస్థితి." తనకేమో భర్త ఉద్యోగం చేస్తుంటే వాళ్ళలాగా వంటచేస్తూ ఇంటిపట్టున ఉండాలని. వీళ్ళకేమో నేను బాగా బతుకుతున్నానని.

"మేడం మీకోసం ఎవరో వచ్చిన్రు. హాస్టల్ల ఉన్నరు. హాస్టల్ల అడ్మిషన్ కోసం పిల్లలను తీసుకొని వచ్చిన్రు." అంటూ హాస్టల్ వాచ్‌మెన్ రావడంతో రెడీ అయి బయల్దేరింది లలిత.

రాత్రి ఎనిమిదింటికి లలిత యింటికి వచ్చాడు పోషయ్య. అరుణ ఫ్రెండ్స్‌తో కల్సి సిన్మాకెళ్ళింది. లలిత యింకా హాస్టల్ నుండి రాలేదు. కాసేపు చూసి హాస్టల్ కేసి నడిచాడు పోషయ్య.

యూనివర్సిటీ హాస్టల్‌లా అందంగా ప్రశాంతంగా ఉంది హాస్టల్. హాస్టల్ చుట్టూరా, లోపలా బిల్డింగ్ పైకి ఎదిగి విచ్చుకున్న చెట్లు. పిల్లలతో ఏదో మాట్లాడుతోంది లలిత. నమస్కరించి నిలబడిపోయాడు పోషయ్య. తొమ్మిదవుతుండగా పోషయ్యను తీసికొని యింటికేసి నడిచింది లలిత.

కూతుర్ని దబాయించి ఒప్పించినట్టు మేడంను ఒప్పించడం తనతో ఎలా అవుతుందని మౌనం వహించాడు పోషయ్య. తాళం తీసి వంటగదిలోకి నడిచింది లలిత. వంట పూర్తయ్యేసరికి అరుణ వచ్చే సింది. తండ్రిని చూసి బయటే నక్కింది.

"అరుణ ఇంట్ల చెప్పక చెయ్యి ఎటో పోయింది. మీ దగ్గరికి వచ్చిందా మేడం." ఆదుర్దాగా అడిగాడు పోషయ్య.

"ఇంట్ల ఏమన్న కొట్లాడుకున్నరా!" అడిగింది లలిత.

పోషయ్య కథంతా చెప్పుకొచ్చాడు. ఎంత చదివితే అంతకన్నా ఎక్వ చదివినవాన్ని వెతికి కట్నం పోసుడు తనతో కాదన్నాడు.

"కట్నం లేకుంట పెళ్ళి చేసికొనెటోల్లు దొరుకరా! కట్నం అడగని పిలగాన్ని నేనెక్కడున్నా జాడదీసి పెళ్ళిచేస్త. అరుణను చదివించు. ఫీజులు నేనేగడ్త. కొంతకాలం నా యింట్లనే నాతోనే ఉంటది. ఏమంటవు...?" సముదాయించింది లలిత.

కూతుర్ని దబాయించి ఒప్పించినట్టు మేడంను ఒప్పించడం తనతో ఎలా అవుతుందని మౌనం వహించాడు పోషయ్య.

తాళం తీసి వంటగదిలోకి నడిచింది లలిత. వంట పూర్తయ్యేసరికి అరుణ వచ్చేసింది. తండ్రిని చూసి బయటే నక్కింది.

"మీరన్నట్టే కానీ మేడం" అన్నాడు పోషయ్య.

ఆ మాట చల్లగా విన్పించి మెల్లగా యింట్లోకి నడిచింది అరుణ.

** ** **

అయిదేళ్ళు గడిచాయి. లలిత యిపుడు అసిస్టెంటు సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పని చేస్తోంది. అరుణ టీచర్‌గా చేరి ఏడాదైపోయింది. అరుణ తమ్ముడు యింటర్లో చేరాడు. కూతురు కాస్త సంపాదించడంతో పెళ్ళిమాట అడగడం మానేశారు తల్లిదండ్రులు. ఎంసెట్‌లో ర్యాంకు వచ్చినా లలితకు చేయూతనిచ్చేవారులేక, కౌన్సిలింగ్‌కు ఎలా వెళ్ళాలో తెలీక మంచి యింజనీరింగ్ సీటు తప్పిపోయిందని అరుణకు లోలోన బాధ తొలుస్తోంది. ప్రమోషన్ యిచ్చి వేరే జిల్లాకు లలిత మేడంను బదిలీ చేయడంతో ఆసరా లేకుండైపోయింది. ఈమధ్యే తిరిగి పాత జిల్లాకు బదిలీ అయింది.

ఇంటర్ క్యాస్టు మ్యారేజీ చేసికొన్న దంపతులకు ప్రోత్సాహకంగా యిచ్చే పదివేల రూ.లు సాంక్షన్ చేసేముందు వారి కులం సర్టిఫికెటును, ఫిజికల్ వెరిఫికేషన్‌ను చేయడం కోసం అరుణ పనిచేస్తున్న ఊరుకు వెళ్ళింది లలిత. వచ్చిన పని పూర్తి చేసికొని అరుణ పనిచేసే స్కూలుకేసి నడిచింది లలిత. క్లాసురూంలోంచి అరుణ గొంతు వినపడింది.

"ప్రవీణ్ లేచి నిలబడు. రవిని ఎందుకేడ్పించినవో చెప్పు" అరుణ అడుగుతోంది.

"నీకన్న ఎక్కువ మార్కులు తెచ్చుకుంట అని రవి అన్నడట మేడం. ఏవి... వెవ్వే... అని వెక్కిరిస్తే ఉట్టిగనే ఏడ్చిండు మేడం." అంటూ ప్రవీణ్ పక్కనున్న విద్యార్థి లేచి చెప్పాడు.

"రవీ! స్టాండప్. వేణు చెప్పింది నిజమేనా?" అడిగింది అరుణ.

ఔనంటూ తలూపి కళ్ళు తుడుచుకున్నాడు రవి.

"ప్రవీణ్! నువ్వు యింట్లో ఏమేం పని చేస్తావు? పెండదీయడం, అంట్లుతోమడం, బోరింగ్ కాన్నుంచి నీల్లుదేవడం, ఆదివారం కూలిపనికిపోవడం ఇంటికాడ కూరగాయల చెట్లు పెంచడం... యిలా ఏమే పనులు చేస్తవ్?"

"వీడు ఇంట్ల ఒక్క పని చెయ్యడు మేడమ్." అన్నాడు పక్క విద్యార్థి ఉత్సాహంగా.

"మరి రవి చూడు యివన్ని పనులు చేస్తడు. వాల్ల నాన్న వేరే ఊర్లో జీతం ఉన్నడు. మీ నాన్న ఊర్లోనే ఉన్నడు. ఏమైన డౌట్సు వస్తే మీ నాన్న చెప్తడు. మీ యింట్లో ఫ్యాను, ట్యూబ్ లైటుంది. వాల్లింట్లో కరెంటు లేదు. కమ్మల గుడిసె. ఇన్ని అసౌకర్యాల్లో కూడా అరవైరెండు శాతం మార్కులు తెచ్చుకోవడం గొప్పా? అన్ని సౌకర్యాలున్న ప్రవీణ్ అరవైతొమ్మిది శాతం మార్కులు తెచ్చుకోవడం గొప్పా? చెప్పండి" ఆర్ద్రంగా ఉంది అరుణ గొంతు. ఎంత చక్కని విశ్లేషణ అని మనసులో మెచ్చుకుంది లలిత.

క్లాసంతా కాసేపు నిశ్శబ్దమైపోయింది.

"రవే గొప్పమేడం..." ఎవరో అనడంతో "గుడ్" అంది అరుణ క్లాసురూం చప్పట్లతో మార్మోగిపోయింది. రవి మొహం ఆనందంతో వెలిగిపోయింది.

లలిత రావడంతో పిల్లలందరు లేచి 'నమస్కారం' చెప్పారు. తమ మ్యాట్రిన్ అని, ప్రస్తుతం పనిచేస్తున్న హోదా వివరించింది అరుణ.

పిల్లల్ని కాసేపు నిశ్శబ్దంగా కూర్చోమని చెప్పి స్టాఫ్‌రూం కేసి నడిచింది అరుణ.

అవీయివీ మాట్లాడుకున్నాక లలిత అరుణను ప్రశంసించింది.

"అరుణా! నీలో నాకు సావిత్రిబాయి ఫులే కన్పించింది."

"ఆమె ఎవరు మేడం"

"ఆమె ఆధునిక భారతదేశంలో మొట్ట మొదటి మహిళా టీచరు. నీలా పేదరికం నుండి పైకొచ్చింది. నాక్కూడా ఆమె గురించి ఈమధ్యే తెల్సింది."

"అయితే ఆమె గురించి తప్పక తెల్సుకోవాలి" అంది అరుణ.

"ఈ ఊళ్ళో ఉద్యోగ జీవితం ఎలా ఉంది అరుణా!"

"చాలా ఆనందంగా ఉంది మేడం. టీచర్ ఉద్యోగంలో యింత తృప్తి జాబ్ సాటిస్‌ఫాక్షన్ ఉంటుందని టీచర్ అయ్యాకే తెల్సింది. ఇంజనీర్ కాలేకపోయాననే చింత తగ్గుతోంది. మీవల్ల టీచర్‌నయ్యాను. అదే సంతోషం. ఇక్కడి లేడీ సర్పంచ్ ఎల్లమ్మ చాలా మంచిది. ఎంతో సహకరిస్తుంది. ఆమె యిప్పటికీ కూలిపనికి పోతుంది తెల్సా మేడం?" ఉత్సాహంగా అంది అరుణ.

"అంత సిన్సియర్ అన్నమాట. సరేగానీ నీ పెళ్ళి సంగతి ఏంచేశావు? పిలగాన్ని చూడనా?"

"ఇపుడే వద్దు మేడం. ఈంత ఎమ్మే అయినంక చూస్త. తమ్ముని చదువైపోవాలె. వానికేదైనా జాబ్ దొరకాలె. అపుడు ఆలోచిస్త మేడం."

"ఇంకా ఏం విశేషాలు... చెప్పు"

"మేడం! కనీసం హాస్టల్‌కు కూడా పంపించలేని పేద తల్లిదండ్రులు ఎందరో ఉన్నారు. వాళ్ళకు ఏ ఆసరా లేక అలాగే మగ్గిపోతున్నారు. వాళ్ళల్లో కూడా ఆశ కలిగించాలె. ఆసరా యివ్వాలె. అలాంటి పిల్లలకు మూడో తరగతి నుండి యాడాదికి 45 రూ.లే స్కాలర్‌షిప్ ఇస్తున్నరు. కాగితాలకు సర్టిఫికేట్లకు అంతకన్నా ఎక్వ ఖర్చయితయి మేడం. ఇరవై ఏండ్ల నుంచి 45 రూ.లే యిస్తున్నరు. కనీసం అది అయిదు వందలైనా చెయ్యాలె మేడం. గుజరాత్‌లో హైస్కూలుకెళ్ళే ఆడపిల్లలకు సైకిళ్ళు ఉచితంగా యిచ్చిందట ప్రభుత్వం. ఇక్కడ కూడా యివ్వాలని పై అధికారుల దృష్టి తీసికెళ్ళండి మేడం."

"తప్పకుండా! ఇంకా మీ ఊరి విశేషాలేంటి?"

"ఇపుడు మావూళ్ళో మా వాడ నుంచి పదిమంది ఆడపిల్లలు టెన్త్ చదువుతున్నరు మేడం.

"గుడ్. వాళ్ళకు నువ్వే ఇన్స్పిరేషన్ అనుకుంట" అరుణ నవ్వింది. ●

## తెల్లకాగితం

మూర్తి: "అదేమిట్రా ఊరునుండి మీ ఆవిడ 'తెల్లకాగితం' మాత్రమే పంపించింది"

శ్రీను: "మరి మా ఆవిడకు నాకు మాటల్లేవు. అందుకే కవర్లో తెల్లకాగితం పెట్టి పంపించింది."

\- సి.హెచ్.వి.వి.ఎస్.మూర్తి, కొమరగంపట్నం